క్లుప్తంగా


అభయాంజనేయుడికి పూజలు



పూజలందుకున్న ఆంజనేయస్వామి

ఆత్మకూరు: పట్టణంలోని పాత బస్టాండులో వెలిసిన అభయాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం వేకువజామున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక హారతులు, అలంకరణ, హోమం, మహామంగళహారతి చేపట్టారు.

శక్తి యాప్‌తో ఆడపిల్లలకు భద్రత



మాట్లాడుతున్న సీఐ రాము

ఆత్మకూరు: శక్తి యాప్‌తో ఆడపిల్లల భద్రత లాంటిదని సీఐ రాము అన్నారు. శుక్రవారం చైతన్య ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో విద్యార్థినులకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చెడు మార్గాల్లో పయణించి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ర్యాష్ డ్రైవింగ్ ప్రాణాలకే ప్రమాదమన్నారు. ఎవరి నుంచైనా ఇబ్బందులుంటూ శక్తి యాప్ ద్వారా పోలీసులకు సమాచారమిస్తే సత్వరమే స్పందిస్తారని బాలికలకు సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రఘురామయ్య, పాఠశాల కరస్పాండెంట్ ఖాజుద్దీన్ పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలకు ప్రభుత్వ గుర్తింపు ఇవ్వాలి



మాట్లాడుతున్న సంఘం నాయకులు

జూపాడుబంగ్లా: గ్రామీణ ప్రాంతాల్లో ప్రథమ చికిత్స అందిస్తూ పేదలకు అండగా నిలుస్తున్న ఆర్‌ఎంపీలకు ప్రభుత్వ గుర్తింపు ఇవ్వాలని ఆర్ఎంపీ, పీఎంపీల అసోషియేషన్ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు రమణారెడ్డి, ఎర్రన్న డిమాండ్ చేశారు. శుక్రవారం మండలకేంద్రంలోని ఎర్రన్న ప్రథమ చికిత్స కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ఆర్ఎంపీ, పీఎంపీల సమావేశంలో వారు మాట్లాడారు. ఇంజెక్షన్, సెలైన్ ఎక్కించటం వంటి వాటికి ఆర్ఎంపీ, పీఎంపీలకు అనుమతులివ్వటంతోపాటు మరికొంత మెరుగైన వైద్యం అందించేందుకు అవకాశం కల్పించాలన్నారు. సమావేశంలో ఆర్ఎంపీలు డి.మౌలాలి, ఖయ్యూం, రవి, సుధాకర్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

నందికొట్కూరు: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏసురత్నం డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సంఘం నాయకులు గోపాలకృష్ణ, ఉస్మాన్ పాల్గొన్నారు.

బీమా చెక్ పంపిణీ



చెక్‌ను అందజేస్తున్న మేనేజర్ అప్పాజీ

ఆత్మకూరురూరల్: మండల పరిధిలోని అమలాపురం గ్రామానికి చెందిన షేక్ మైమూన్‌బీకి ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ అప్పాజి అందజేశారు. శుక్రవారం ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మైమూన్‌బీ భర్త ఉస్మాన్ ఎస్‌బీఐ ఖాతాదారుడు కావడంతోపాటు పీఎంఎస్‌బీవై బీమా పథకంలో రూ.20 ప్రీమియం చెల్లించేవారన్నారు. అతడు ఇటీవల విద్యుదాఘాతంతో మృతిచెందడంతో నామినీ అయినా భార్య మైమూన్‌బీకి రూ.2 లక్షల చెక్కు అందించామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌టీసీఎఫ్ఎల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి ఆంజనేయులు, ప్రాజెక్ట్ మేనేజర్ అశోక్ కుమార్, కౌన్సిలర్లు శంకరయ్య, విజయరామరాజు పాల్గొన్నారు.

రైతులను మోసం చేయడం తగదు



మాట్లాడుతున్న పిక్కిలి వెంకటేశ్వర్లు

జూపాడుబంగ్లా: అన్నదాత సుఖీభవ నిధులివ్వకుండా రైతులను మోసం చేయడం తగదని సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఏడాదికి రూ.20 వేలు పంటల సాగుకు ముందే ఇస్తానని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు.

బుడ్డా..నిద్ర లే!



హాజరైన రేగడగూడూరు గ్రామస్తులు

- రైతులకు ఎరువులు అందడం లేదు
- కొత్తగా ఒక్క పింఛన్ కూడా మంజూరు కాలేదు
- సూపర్ సిక్స్ మాటేంటి
- స్థానిక ఎమ్మెల్యేపై నిప్పులు చెరిగిన మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

వెలుగోడు: 'రైతులకు ఎరువులు అందడం లేదు. కొత్తగా ఒక్క పింఛన్ కూడా మంజూరు కాలేదు. సూపర్ సిక్స్ పథకాల్లో ఒక్కటీ సక్రమంగా అమలు చేసిందీ లేదు. నిద్ర లే బుడ్డా' అంటూ వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిపై నిప్పులు చెరిగారు. 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని శుక్రవారం రేగడగూడూరు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ ప్రజలు సమస్యలతో కొట్టుమిట్టాడుతుంటే ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి నిద్రపోతూ గత ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఆరోపిస్తుండటం సిగ్గుచేటన్నారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకున్న కూటమి నేతలు అధికారంలోకి వచ్చి ఏడాదైనా హామీలు అమలు చేయకపోగా ఆడబిడ్డ నిధి ఇవ్వాలంటే ఆంధ్రప్రదేశ్‌ను అమ్మాలని ఇటీవల మంత్రి అచ్చెన్నాయుడు నిస్సిగ్గుగా మాట్లాడారని శిల్పా ఫైర్ అయ్యారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చినప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గుర్తు లేదా అని నిలదీశారు. ఆడబిడ్డ నిధి రూ.1,500 ఇవ్వడానికే ఆంధ్రను అమ్మాల్సి వస్తే నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇవ్వడానికి దేశాన్ని అమ్ముతారా అని ప్రశ్నించారు. బానకచెర్ల పేరుతో చంద్రబాబు కొత్త డ్రామాలు మొదలుపెట్టారని దుయ్యబట్టారు. రాయలసీమను రత్నాల సీమగా మార్చేందుకు నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి ఎస్ఆర్‌ఎంసీ విస్తరణ పనులు చేపడితే, ఆయన తనయుడు వైఎస్ జగన్ ఒకేసారి 80 వేల క్యూసెక్కుల నీటిని తరలించేందుకు రాయలసీమ ఎత్తిపోతల పనులకు శ్రీకారం చుట్టారన్నారు. జగన్‌కు ఎక్కడ పేరొస్తుందోననే భయంతో పథకాన్ని ఆపేశారని మండిపడ్డారు.

ఎమ్మెల్యేను నిలదీయండి

ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకుండా, సంక్షేమ పథకాలు అమలు చేయకుండానే తొలి అడుగు పేరుతో గ్రామాలకు వచ్చే ఎమ్మెల్యేను, కూటమి నేతలను ఎక్కడికక్కడే నిలదీయాలని ప్రజలకు శిల్పా చక్రపాణిరెడ్డి సూచించారు. యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా ప్రభుత్వం మాత్రం కావాల్సినంత యూరియా ఉందని చెబుతోందని, ఎక్కడ ఉందో చూపాలని ఎమ్మెల్యేను నిలదీయాలన్నారు.



మాట్లాడుతున్న శిల్పా చక్రపాణిరెడ్డి

వైఎస్సార్‌సీపీ హయాంలో రేగడగూడూరులోనే రూ.8.85 కోట్ల అభివృద్ధి

వైఎస్సార్‌సీపీ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉండగా రేగడగూడూరు గ్రామంలోనే రూ.8.85 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు శిల్పా చక్రపాణిరెడ్డి తెలిపారు. వెలుగోడు నుంచి గుంతకందాలకు ప్రత్యేక కరెంటు లైన్ ఏర్పాటు చేయించానని, రూ.350 కోట్లతో తెలుగుగంగ కాల్వ లైనింగ్ పనులు చేపట్టామని గుర్తు చేశారు. వీబీఆర్ కట్టను పటిష్టపరచి పూర్తి సామర్థ్యంతో నీటిని నింపేలా చర్యలు తీసుకున్నామన్నారు. తాను ఇంటింటా పర్యటించకుండా ఒక చోట కూర్చున్నానని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇదే మాట ప్రజలతో చెప్పిస్తే రాజకీయ సన్యాసానికి సిద్ధమని శిల్పా సవాల్ విసిరారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తూ కూటమి ప్రభుత్వం చట్ట వ్యతిరేక కార్యాకలాపాలకు పాల్పడుతోందని విమర్శించారు. బెదిరింపులకు భయపడే వారెవరూ వైఎస్సార్‌సీపీలో లేరని, తప్పు చేసిం ఉంటే ప్రజల వద్దకు వచ్చే వాళ్లమే కాదన్నారు. నిత్యం అబద్ధాలతో కూటమి నాయకులు చేస్తున్న వాగ్దానాలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దేశం తిరుపంరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, నాయకులు దుబ్బా సిద్ధార్థరెడ్డి, నందిరెడ్డిగారి రామిరెడ్డి, కుళాయిస్వామిరెడ్డి, గఫార్‌ఖాన్ పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని పలు గ్రామాల ఆలయాలకు శుక్రవారం ధర్మకర్తల మండలి మండల సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగిందని గ్రూపు దేవస్థానముల ఈఓ ఈ నాగ ప్రసాద్ తెలిపారు. ఈర్నపాడు ఈశ్వర చెన్నకేశవ కోదండ రామస్వామి ఆలయానికి వి.చిన్న కాశన్న, కడమల కాలువ చెన్నకేశవ స్వామి ఆలయానికి అనకల బాలన్న, సింగవరం వెంకటేశ్వర ఆంజనేయ స్వామి ఆలయానికి ఎం.శివసాయి సంజన్నలను చైర్మనుగా ఎన్నిక కావడంతో వారితోపాటు పాలక మండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించామన్నారు. కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారిగా నంద్యాల డివిజన్ తనిఖీ అధికారి పి.హరిచంద్ర రెడ్డి పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి



గాలేరు నదిని పరిశీలిస్తున్న తహసీల్దార్ పద్మావతి

బండి ఆత్మకూరు: గాలేరు నది పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ పద్మావతి సూచించారు. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నీటిమట్టం పూర్తిస్థాయికి చేరుకోవడంతో డ్యామ్ గేట్లు ఎత్తి గాలేరు నదికి నీటిని విడుదల చేస్తున్నందున, వరద ప్రభావం అధికంగా ఉంటుందన్నారు. గాలేరు నది పరివాహక గ్రామాలు సంతజూటూరు, బండి ఆత్మకూరు, కాకునూరు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రేమ పేరుతో గిరిజన యువతికి మోసం

ఆత్మకూరు: ప్రేమ పేరుతో చెంచు గిరిజన యువతిని మోసం చేసిన ఆటో డ్రైవర్ పఠాన్ దస్తగిరిపై చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకుడు జవహర్‌నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఆత్మకూరులో విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలోని కొట్టాల చెరువు చెంచుగూడెంకు చెందిన ఓ యువతికి రెండేళ్ల క్రితం కర్నూలులో డిగ్రీ చదివే సమయంలో నంద్యాల పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ పఠాన్ దస్తగిరి ప్రేమ పేరుతో మాయ మాటలు చెప్పి మోసం చేశాడన్నారు. వివాహం చేసుకోకుండా సహజీవనం చేయడంతో ఈ ఏడాది జనవరి నెలలో ఆ యువతి మగబిడ్డకు జన్మనిచ్చిందన్నారు. ఆతర్వాత యువతిని వదిలేయడంతో రోడ్డున పడిందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి చెంచు యువతికి న్యాయం చేయాలని ఆయన కోరారు.

భ్రామరీకి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 7గంటలకు ప్రారంభమైన సేవలో భాగంగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అలాగే శ్రీశైలగ్రామ దేవతగా పిలవబడుతున్న అంకాళమ్మ అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు.

తాగునీటి పరీక్షలు నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

పాములపాడు: గ్రామ ఆరోగ్య ఉపకేంద్రాల్లోని ఎంఎల్‌హెచ్‌పీలు, సిబ్బందితో కలిసి తాగునీటి పరీక్షలు నిర్వహించి నివేదికలు అందజేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం ఆయన ఎంఎల్‌హెచ్‌పీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పర్యటించి తాగునీరు కలుషితం గాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పైపుల లీకేజీ, తాగునీటి కలుషితం సమస్యలుంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. పక్షం రోజుల కోసారి ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయించాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. గ్రీన్‌అంబాసిడ్లతో గ్రామాల్లోని మురుగునీటి కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలన్నారు.

మొక్కలు నిర్లక్ష్యంపాలు!



నాటకుండా గ్రామసచివాలయం వద్ద పారవేసిన మొక్కలు

జూపాడుబంగ్లా: ప్రతి ఒక్కరూ ఓ మొక్కను నాటి సంరక్షించి పర్యావరణాన్ని కాపాడాలంటూ ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చే అధికారులు.. వారి పరిధిలో ఉన్న మొక్కలు నాటడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. జూన్ మాసంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి గ్రామ సచివాలయానికి 250 మొక్కల చొప్పున కేటాయించారు. వాటిని సచివాలయ ఉద్యోగులు నాటి సంరక్షించాలని అధికారులు ఆదేశించారు. అందులో భాగంగా పారుమంచాల గ్రామ సచివాలయానికి మంజూరైన మొక్కలను కొన్నింటిని తూతూ మంత్రంగా నాటిని ఉద్యోగులు.. మితగా వాటిని సచివాలయం పక్కనే పడేశారు. మండలస్థాయి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే సచివాలయ ఉద్యోగులు మొక్కలను వృథాగా పడేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- పుడమితల్లికి లిల్లీపూలాభిషేకం!



మహానంది మండల కేంద్రం ఎం.తిమ్మాపురం నుంచి జమాలయ్యదర్గా దారిలో ఓ లిల్లీపూలతోట చూపరులకు ఆకట్టుకుంటోంది. పచ్చటి కాడలు, తెల్లటి పూలతో పుడమితల్లికి పచ్చటి చీర కట్టి, పుష్పాభిషేకం చేస్తున్నట్లున్న చిత్రాన్ని 'సాక్షి' కెమెరాలో బంధించింది.

– మహానంది

ఆర్థిక సాయం



సుబ్బయ్యకు ఆర్థిక సాయం అందజేస్తున్న అరవింద్‌రెడ్డి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలోని పాతాళగంగ మెట్ల సమీపంలో నివాసం ఉంటున్న సుబ్బయ్య బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యాడు. వైద్యఖర్చుల నిమిత్తం శివోహం టెంపుల్ ట్రస్ట్ నిర్వాహకులు దొంతిరెడ్డి అరవింద్‌రెడ్డి అతడిని పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

మహానందిలో వర్షం

మహానంది: మండలంలో మూడు రోజుల నుంచి నిత్యం ఏదో ఒక సమయంలో వర్షం కురుస్తూనే ఉంది. మహానంది పుణ్యక్షేత్రం పరిసరాల్లో శుక్రవారం మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. సమీప గ్రామాల్లోనూ వర్షం పడింది.

కామేశ్వరీదేవికి ప్రతి శుక్రవారం ప్రత్యేక అలంకరణ



వివరాలు వెల్లడిస్తున్న ఈఓ ఎన్.శ్రీనివాసరెడ్డి

మహానంది: మహానందిలో శ్రావణమాసం సందర్భంగా ప్రతి శుక్రవారం ప్రత్యేక అలంకార పూజలు ఉంటాయని ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, ఏఈఓ ఎరమల మధు, ఉపప్రధాన, ముఖ్య అర్చకులతో నిర్వహించిన సమావేశంలో ఆమర మాట్లాడారు. మొదటి శుక్రవారం కామేశ్వరీదేవికి గాజులతో, రెండో శుక్రవారం పసుపు కొమ్ములతో, 3వ శుక్రవారం ఫలములతో, 4వ శుక్రవారం పట్టుచీరలతో అలంకరణ ఉంటుందన్నారు.

శివచతుస్సప్తాహ భజనలు



శివచతుస్సప్తాహ భజనలు ప్రారంభిస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో లోకకల్యాణం కోసం శ్రావణమాసం సందర్భంగా శివచతుస్సప్తాహ భజనలు ప్రారంభించింది. శుక్రవారం స్వామివారి ఆలయ ప్రాంగణంలోని వీరశిరోమండపం వద్ద ఈ మాసమమంతా రేయింబవళ్లు భజన సాగనుంది. ప్రారంభ పూజల్లో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు. ముందుగా అర్చకులు లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం భజన కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపారు. చండీశ్వరస్వామికి విశేషపూజలు జరిపి, శివప్రణవ పంచాక్షరీనామ భజనలు ప్రారంభించారు. కర్నూలుకు చెందిన ఐదు భజన బృందాలు, కర్ణాటకకు చెందిన రెండు భజన బృందాలకు శ్రావణమాసంలో భజనలు చేయడానికి అవకాశం కల్పించారు.

అదానికి దోచి పెట్టేందుకే స్మార్ట్ మీటర్లు

ఆత్మకూరు: ప్రజల సొమ్మును అదానికి దోచి పెట్టేందుకే స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని సీపీఎం పట్టణ కార్యదర్శి రణధీర్ విమర్శించారు. శుక్రవారం సుదర్శనవర్మ భవన్‌లో ఏర్పాటు చేసిన పార్టీ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్మార్ట్ మీటర్లు పెట్టడం వల్ల ప్రజలకు జరిగే నష్టంపై ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంచుతూ వివరిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు పెంచబోమని చెప్పి నేడు మాట మార్చడం సిగ్గుచేటన్నారు. స్మార్ట్‌మీటర్లను వెంటనే తొలగించాలన్నారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం పట్టణ నాయకులు మంజుల, వీరన్న, నాగేశ్వరరావు, సద్దాంహుసేన్, జబీవుల్లా పాల్గొన్నారు.

మహానందీశుడి దంపతులకు పల్లకోత్సవం



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానందీశుడి దంపతులకు శుక్రవారం రాత్రి పల్లకీసేవను శుక్రవారం ఆలయ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి.సుబ్బారెడ్డి, వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు ఘనంగా నిర్వహించారు. గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి భాజాభజంత్రీలు, మంగళవాయిద్యాలతో ఆలయ ప్రాకారంలో ఉత్సవాన్ని నిర్వహించారు.

సన్మానం



నందికొట్కూరు: పగిడ్యాల మండలం ప్రాతకోట ప్రభుత్వ వైద్యశాల నుంచి బదిలీపై వెళ్తున్న డాక్టర్ కృష్ణమూర్తి, సచివాలయ ఏఎన్‌ఎంలు బాలసరస్వతి, పుష్పలతలను శుక్రవారం సిబ్బంది ఘనంగా సన్మానించారు.

మల్లన్నకు నృత్యనీరాజనం



నృత్యప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన ఎస్.నటరాజ అకాడమీ వారి సంప్రదాయ నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. మూషికవాహన, లింగాష్టకం, శివాష్టకం, మహాదేవ శివ, అయిగిరినందిని తదితర గీతాలకు, అష్టకాలకు సంతోషిణి, గాయత్రి, ఆరాధ్య, అక్షర, మేఘన తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

వంతెన నిర్మాణం.. నత్తతో పోటీ!

- మూడు మాసాల్లో పూర్తిచేయాల్సిన పనులు రెండేళ్లైనా కొనసాగుతున్న ఇసుక వాగు వంతెన నిర్మాణం
- చిన్నపాటి వర్షానికే ఉప్పొంగుతున్న వాగు.. గంటల తరబడి స్తంభిస్తున్న రాకపోకలు
- త్వరగా పూర్తి చేయించాలని కోరుతున్న గ్రామస్తులు, ప్రయాణికులు

పారుమంచాల ఇసుక వాగు వంతెన నిర్మాణం నత్తతో పోటీ పడుతోంది. మూడు మాసాల్లో పూర్తి చేయాల్సిన కాంట్రాక్ట్ సంస్థ రెండేళ్లైనా పనులను ఒక కొలిక్కి తీసుకురాలేకపోయింది. ఫలితంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు వాగు ఉప్పొంగుతుండటంతో రాకపోకలు స్తంభించిపోతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి త్వరగా వంతెన నిర్మాణం పూర్తిచేయాలని పలువురు కోరుతున్నారు.



ఇసుకవాగుపై ఏడాది కాలంగా కొనసాగుతున్న వంతెన నిర్మాణం పనులు

జూపాడుబంగ్లా: పారుమంచాల గ్రామశివారులో ఇసుకవాగు ఉంది. గడివేముల, మిడుతూరు, ఓర్వకల్లు ప్రాంతాల్లో చిన్నపాటి వర్షం కురిసినా ఇసుక వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో రాకపోకలు స్తంభిస్తున్నాయి. సమస్యను గుర్తించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులను మంజూరు చేసింది. 2023 ఆగస్టు 8న వంతెన నిర్మాణానికి అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గనరాజేంద్రనాథ్‌రెడ్డి భూమి పూజ చేశారు. కాగా వాగుపై హైలెవెల్ వంతెన నిర్మాణాన్ని మూడు మాసాల్లోగా పూర్తిచేస్తామని రూ.5 కోట్లకు పనులు దక్కించుకున్న ఎస్వీ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ రెండేళ్లు గడిచినా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది.

రాకపోకలకు అంతరాయం

60 ఏళ్ల క్రితం నుంచి ఇసుకవాగుపై వంతెన నిర్మాణానికి నోచుకోకపోవటంతో చిన్నపాటి వర్షం కురిసినా రాకపోకలు స్తంభించిపోయేవి. ఈ దారి గుండా పారుమంచాల, తూడిచెర్ల, మిట్టకందాల, పాములపాడు, వాడాల, రేగడగూడూరు, వేల్పనూరు, వెలుగోడు మీదుగా జిల్లా కేంద్రం నంద్యాలకు రాకపోకలు కొనసాగుతాయి. అలాగే పారుమంచాల గ్రామ ప్రజలు, రైతులు పొలాలకు వెళ్లాలన్నా, మండలకేంద్రమైన జూపాడుబంగ్లాకు, నందికొట్కూరుకు కూడా ఇసుకవాగుదాటి వెళ్లాల్సి ఉంటుంది. వర్షం వచ్చి ఇసుకవాగు పొంగిపొర్లిందంటే గంటల తరబడి వాహనాల రాకపోకలు స్తంభించిపోతుండటంతో ప్రయాణికులు, వాగు ఉధృతి తగ్గేవరకు వేచిచూడాల్సి వస్తుంది. 60 ఏళ్లుగా ఇదేతంతు కొనసాగుతుండగా వైఎస్సార్‌సీపీ హయాంలో వంతెన మంజూరు చేయటంతో ప్రజలు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. కానీ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ సకాలంలో పూర్తిచేయక పోవటంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వంతెన నిర్మాణం పూర్తి చేయాలి



ఇసుక వాగుపై వంతెన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి. వంతెన నిర్మాణం పనులు ప్రారంభమై చాలా రోజులైనా ఇంక పూర్తిచేయకపోవడం తగదు. వాగువస్తే గ్రామం నుంచి పొలాలకు వెళ్లాలన్నా, ఇతర గ్రామాలకు వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. అధికారులు చర్యలు తీసుకుని వంతెన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయించాలి.

– రంగస్వామి, పారుమంచాల

వాగువచ్చిందంటే గ్రామం విడిచి వెళ్లలేం



గ్రామానికి సమీపంలో ఉన్న ఇసుకవాగు ఉప్పొంగిందంటే తగ్గే వరకు ఊరు విడిచి ఎక్కడికీ వెళ్లలేం. వాగుపై రెండేళ్ల క్రితం వంతెన నిర్మాణం ప్రారంభించారు. ఇప్పటికీ పూర్తికాలేదు. అధికారులు త్వరగా నిర్మిస్తే మాకు వాగు కష్టాలు తప్పి సు లభంగా ప్రయాణం చేసే అవకాశం ఉంటుంది.

– వెంకటరమణ, పారుమంచాల